COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

# 18.4.2016న జరిగిన సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం ఆమోదించిన తీర్మానం

**ప్రచురణార్థం:** సోమవారంనాడు దడాల సుబ్బారావు అధ్యక్షతన సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. అందులో ఆమోదించిన తీర్మానాన్ని ప్రచురణార్థం పంపుతున్నాను. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

తేది : 19.04.2016

భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లకు, పౌరులకు ప్రసాదించిన ప్రజాస్వామిక హక్కులకు భంగం కలిగించే రీతిన రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సిపిఐ(యం) తీవ్రంగా ఖండిస్తున్నది. సిఆర్‌డిఏ ఇటీవల రూపొందించిన హెచ్‌ఆర్ పాలసీ, గిరిజన ఉప ప్రణాళిక నోడల్ ఏజెన్సీకి ప్రైవేటు కన్సల్టెన్సీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జి.వో నెం.47 ఇందుకు తాజా తార్కాణాలు. వీధి కుళాయిలతో సహా పట్టణాలు, నగరాల్లోని త్రాగునీటి కనెక్షన్లన్నింటికీ మీటర్లు బిగించాలని నిర్ణయించడం అన్యాయం. అంతర్వేది వద్ద డ్రెడ్జింగ్ హార్బరు నిర్మాణ ప్రతిపాదనపై శాస్త్రీయ అధ్యయనం, బహిరంగ విచారణ నిర్వహించాలని ప్రభుత్వాన్ని సిపిఐ(యం) కోరుతున్నది.

రాజధాని ప్రాంత అభివృద్ధి సాధికార సంస్థ (సిఆర్‌డిఏ) ఉద్యోగుల కోసం రూపొందించిన హెచ్‌ఆర్ పాలసీ నిబంధనల్లో రిజర్వేషన్లను నిరాకరించడం, ఉద్యోగులపై అనేక షరతులు విధించడం గర్హనీయం. ఉద్యోగులు సంఘాల్లో చేరకూడదని, సమ్మెలు, ఆందోళనలు నిర్వహించరాదని, ఎలాంటి ప్రదర్శనలు కూడా చేయరాదని ఆంక్షలు విధించింది. ఉద్యోగుల వ్యక్తిగత, కుటుంబ అంశాలపై కూడా షరతులు పెట్టింది. ఉద్యోగుల పెళ్లి మొదలు వారి పిల్లల నడవడిక గురించి కూడా సిఆర్‌డిఏ జోక్యం చేసుకోవడం రాజరిక వ్యవస్థను తలపిస్తున్నది. వివిధ మత సాంప్రదాయాలను బట్టి ఏర్పడిన కొన్ని చట్టాలను (పర్సనల్ లా) సైతం లెక్కచేయని రీతిలో హెచ్‌ఆర్ నిబంధనలు రూపొందించడం పౌరహక్కుల్ని హరించడమే.

గిరిజన ఉప ప్రణాళిక అమలు పేరుతో ప్రైవేటు కన్సెల్టెన్సీని ఏర్పాటు చేయడం గిరిజనుల ఉపాధిని నిరాకరించడమే. ఇప్పటికే ఐటిడిఎల్లో వున్న వందలాది ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయలేదు. అలాగే రాష్ట్ర గిరిజన సంక్షేమ డైరెక్టరేట్, గిరిజన సాంస్కృతిక పరిశోధనా కేంద్రంలోని ఖాళీల భర్తీ ఊసెత్తడంలేదు. ఇప్పుడు అమాంతంగా ప్రైవేటు కన్సల్టెన్సీని ఏర్పర్చడం ద్వారా వాటిలో అమలు కావాల్సిన రిజర్వేషన్లను గిరిజనులతోపాటు యువత కోల్పోతున్నది. ఇంతేగాక ప్రతిపాదనలను పరిశీలించడం, అమలుకు మార్గదర్శకత్వం వహించడంతోపాటు శాఖలవారీగా జరిగే పనుల ప్రగతిని ప్రైవేటు కన్సల్టెన్సీ మోనిటర్ చేయబూనడం పాలనను ప్రైవేటుకు అప్పచెప్పడమే. అంటే ఐటిడిఎలు, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరేట్ నిర్వీర్యం అవుతాయి.

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని దేశవ్యాపితంగా ఆందోళనలు సాగుతున్న సమయంలో ప్రభుత్వ సంబంధిత శాఖల్లో రిజర్వేషన్లు లేకుండా చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ రిజర్వేషన్ వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని, ఉద్యోగులపట్ల నిరంకుశ వైఖరిని విడనాడాలని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నది. ట్రేడ్ యూనియన్లు, ఉద్యోగ సంఘాలు, సామాజిక సంస్థలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతున్నది. ప్రభుత్వ ధోరణులపట్ల ప్రగతిశీల శక్తులు, ప్రజాతంత్రవాదులు అప్రమత్తంగా వుండాలని విజ్ఞప్తి చేస్తున్నది.

అమృత్ పథకం మాటున రాష్ట్రంలోని 31 నగరాలు, పట్టణాలలో వీధికుళాయిలతో సహా మంచినీటి కనెక్షన్లన్నింటికీ మీటర్లు బిగించి చార్జీలు వసూలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం ప్రజల మీద భారాలు మోపడమే. సంస్కరణల పేరుతో దశల వారీగా ఆస్థిపన్ను, ఇతర సేవలకు ఛార్జీలను పెంచే ప్రమాదం దీనిలో పొంచి ఉంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలపై అమృత్ సంస్కరణల పేరుతో మరిన్ని భారాలు పడే ప్రమాదం ఉంది. భారాలను తిప్పి కొట్టేందుకు ప్రజలు ఆందోళనలకు సన్నద్ధం కావాలని సిపిఐ(యం) కోరుతున్నది.

గోదావరి నది సముద్రంలో కలిసే అంతర్వేది వద్ద డ్రెడ్జింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై ప్రజల్లో అనేక భయాందోళనలు నెలకొన్నాయి. మత్స్యకారులకు ఉపాధి పోవడంతోపాటు సమీపంలోని మడ అడవులకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని పర్యావరణ వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. ఈ నేపథ్యంలో హార్బరు ప్రతిపాదనపై శాస్త్రీయమైన అధ్యయనాన్ని నిర్వహించి, ఆ ప్రాతిపదికగా బహిరంగ విచారణ నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నది.

= = = =